ఆదివారం 25-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 435 పేజీలు: 4 | ₹6


EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com




మృతదేహం ఖననానికి స్థలం ఇవ్వం

మిగతా 2లో




జంక్ ఫుడ్ తినొద్దని చెప్పిన భర్త.. భర్తపై గృహ హింస కేసు పెట్టిన భార్య

మిగతా 2లో



ఆడపిల్లకు మొదటి హీరో నాన్నే..!

మిగతా 4లో



గొడవైతే ఏడ్చేస్తా

మిగతా 5లో

# నక్సల్స్ అంతానికి పకడ్బందీ వ్యూహం

- ఇప్పటివరకు 17 వేల మంది బలయ్యారు
- అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశంలో అమిత్ షా

ముందడుగు జాతీయం:

దేశంలో మావోయిస్టుల హింస ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా చాలా మారిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పటివరకు 17 వేలమంది దీనికి బలయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నక్సల్స్ అంతానికి బలమైన, పకడ్బందీ వ్యూహం అవసరమన్నారు. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



2004-14 వ్యవధితో పోలిస్తే 2014-24 మధ్యకాలంలో నక్సల్స్ సంబంధిత ఘటనల్లో 53 శాతం తగ్గుదల నమోదైనట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. ఏకకాలంలో భద్రతా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు మావోయిస్టు హింస నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు.

# ఏపీ నుంచి రావాల్సిన నిధులు ఇప్పించండి

## నిర్మలా సీతారామన్‌ను కోరిన భట్టి విక్రమార్క



ముందడుగు తెలంగాణ:

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న మేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు ఇంకా రాలేదని, వాటిని వెంటనే ఇప్పించే విధంగా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను వివరించి సాయం చేయాలని కోరినట్లు మీడియా సమావేశంలో తెలిపారు. 2014-15లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి.. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలకు చెందిన మొత్తం నిధులను ఆంధ్రప్రదేశ్ ఖాతాలోనే వేశారు. తెలంగాణ వాటా నిధులు తిరిగి ఇవ్వాలని కోరాం. 2019-20, 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం కేటాయించిన నిధులు రాష్ట్రానికి రాలేదు. ఆ నిధులు కూడా వెంటనే విడుదల చేయాలని అడిగాం. వెంటనే స్పందించి

మిగతా 2లో

# మహిళా కమిషన్ ముందుకు కేటీఆర్

## మహిళలను గౌరవించాలనే వచ్చానని వెల్లడి

ముందడుగు హైదరాబాద్:


బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మహిళ కమిషన్ ముందు విచారణకు హాజరైన అనంతరం ఆయన మాట్లాడారు. తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల పట్ల ఇప్పటికే విచారం వ్యక్తం చేశానని అన్నారు. కాంగ్రెస్ నేతలు కమిషన్ కార్యాలయం వద్దకు వచ్చి రాజకీయం చేశారన్నారు. బీఆర్ఎస్ మహిళా నేతలపై దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను గౌరవించాలని విచారణకు వచ్చినట్లు



తెలిపారు. రాష్ట్రంలోని సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వసతి గృహాల్లో పిల్లల సమస్యలపై ప్రస్తావించినట్లు కేటీఆర్ తెలిపారు. అంతకుముందు విచారణ సందర్భంగా కేటీఆర్‌కు మహిళా కమిషన్ సభ్యులు రాఖీలు కట్టారు.

# నిందితుడికి సంజయ్ రాయ్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష

## కోల్‌కతా వైద్యురాలిపై అత్యాచార కేసు ముమ్మరం



ముందడుగు పశ్చిమబెంగాల్:

పశ్చిమబెంగాల్ కోల్‌కతా వైద్యురాలిపై అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు నిందితుడు

మిగతా 2లో

ముందడుగు
ఆదివారం, 25-08-2024, హైదరాబాద్

# అండర్ ట్రయల్ ఖైదీలకు శుభవార్త

- త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు
- జైలు సూపరిండెంట్లకు సుప్రీం కోర్టు ఆదేశాలు

ముందడుగు ఢిల్లీ:
కొన్ని ఏళ్ల నుంచి దేశవ్యాప్తంగా జైళ్లలో మగ్గిపోతున్న అండర్ ట్రయల్ ఖైదీలతో పాటు తొలిసారి జైలుకెళ్లిన వారికీ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుభవార్త చెప్పింది. వీరిని త్వరిత గతిన విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్ని జైళ్ల సూపరిండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం తాజాగా తీసుకొచ్చిన క్రిమినల్ న్యాయ చట్టం భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 479 ప్రకారం వీరిని సాధ్యమైనంత త్వరగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



విచారణ ఖైదీలు తమ జైలు శిక్షలో మూడింట ఓ వంతు పూర్తి చేసుకుంటే వీరిని విడుదల చేసేందుకు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత లోని సెక్షన్ 479 ప్రకారం చర్యల్ని వేగవంతం చేయాలని సుప్రీంకోర్టు జైలు సూపరింటెండెంట్ లకు ఆదేశాలు జారీ చేసింది. జైళ్ల రద్దీకి సంబంధించి దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా ఖైదీలకు ఊరట దగ్గబోతోంది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ హిమా కోహ్లి, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం దేశవ్యాప్తంగా ఉన్న జైళ్ల సూపరింటెండెంట్‌లను మూడు నెలల్లోగా వీరి దరఖాస్తులను ప్రాసెస్ చేయాలని ఆదేశించింది. అయితే ఈ నిబంధన మరణశిక్ష లేదా జీవిత ఖైదు వంటి ఘోరమైన నేరాలకు పాల్పడిన అండర్ ట్రయల్‌లకు వర్తించదని సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో ఇప్పుడు జైళ్లలో అండర్ ట్రయల్ ఖైదీలుగా ఉన్న వారు బెయిల్ కోసం చేసుకున్న దరఖాస్తులను ప్రాసెస్ చేసుకునేందుకు వీలు కలిగినట్లయింది.

# ఏపీ నుంచి రావాల్సిన నిధులు ఇప్పించండి

(మొదటిపేజీ తరువాయి)
పెండింగ్ అంశాలపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశాం'' అని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చెప్పిన 8 అంశాలపై నిర్మలాసీతారామన్ సానుకూలంగా స్పందించారని భట్టి చెప్పారు. త్వరలోనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార మార్గం చూపిస్తామని తెలిపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రికి ఈ సందర్భంగా భట్టి ధన్యవాదాలు తెలిపారు.

# నిందితుడికి సంజయ్ రాయ్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)
సంజయ్ రాయ్ సహా మరో ఆరుగురికి శనివారం పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిందితుడు సంజయ్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా జైల్లో ఉండగా.. అక్కడే లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఈ కేసులో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్‌ఘోష్, బాధితురాలిపై హత్యాచార ఘటన చోటుచేసుకున్న రోజు డ్యూటీలో ఉన్న మరో నలుగురు వైద్యులు, మరో సివిల్ వాలంటీర్‌కు కూడా నేడు పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దిల్లీ నుంచి సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందం కోల్‌కతా చేరుకుంది. ప్రస్తుతం ఈ పరీక్షలు కొనసాగుతున్నాయి.

# మోడీని, యోగిని ప్రశంసించిన ముస్లిం మహిళ

## ఆగ్రహంతో ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్త




ముందడుగు ఉత్తరప్రదేశ్:
ఒక ముస్లిం మహిళ భారత ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ప్రశంసించింది. దీనిపై ఆగ్రహించిన ఆమె భర్త ట్రిపుల్ తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మొహల్లా సరాయ్ ప్రాంతానికి చెందిన ముస్లిం మహిళకు గత ఏడాది డిసెంబర్ 13న అయోధ్యలోని మొహల్లా ఢిల్లీ దర్వాజా ప్రాంతానికి చెందిన అర్షద్‌తో వివాహం జరిగింది.

పెళ్లి తర్వాత అయోధ్యలోని అత్తవారింటికి చేరుకున్న ఆ ముస్లిం మహిళకు అక్కడి రోడ్లు, సుందరీకరణ, అభివృద్ధి, వాతావరణం ఎంతో నచ్చాయి. దీంతో భర్త ముందు సీఎం యోగి, ప్రధాని మోడీని ఆమె ప్రశంసించింది. ఆగ్రహించిన భర్త అర్షద్ భార్యను కొట్టడంతోపాటు కాలుతున్న పాన్‌ను ఆమెపై విసిరాడు. అలాగే భార్యను పుట్టింటికి పంపేశాడు. మరోవైపు కొన్ని రోజుల తర్వాత బంధువుల జోక్యంతో ఆ మహిళ తిరిగి అయోధ్యలోని భర్త ఇంటికి చేరుకున్నది.

అనంతరం భర్త తనను కొట్టడంతోపాటు మోదీ, యోగిని ప్రశంసించినందుకు తిట్టి ట్రిపుల్ తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడని ఆ మహిళ ఆరోపించింది. భర్తతో పాటు అత్తింటి వారు కూడా తనను వేధించి చిత్రహింసలకు గురిచేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో అర్షద్, అతడి కుటుంబ సభ్యులతో సహా 8 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మృతదేహం ఖననానికి స్థలం ఇవ్వం

- అత్యాచార నిందితుడిపై గ్రామస్థుల తీర్మానం
- నేరస్థుల కుటుంబంతో కలిసి జీవించలేమని వెల్లడి

ముందడుగు అస్సాం:
అస్సాంలో మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు తఫాజుల్ ఇస్లాం శనివారం ఉదయం పోలీసుల అదుపు నుంచి తప్పించుకున్నాడు. నాగావ్ జిల్లాలోని డింగ్ వద్ద చెరువులో దూకి మరణించిన విషయం తెలిసిందే. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశామని.. తెల్లవారుజామున 3.30 గంటలకు 'క్రైమ్ సీన్'ని విచారించడానికి నేరస్థలానికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు తఫ్జుల్ ఇస్లాం పోలీసుల అదుపు నుంచి తప్పించుకుని చెరువులో దూకాడని పేర్కొన్నారు. వెంటనే సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించగా.. సుమారు రెండు గంటల తర్వాత అతని మృతదేహాన్ని వెలికితీశారు. నిందితుడి సొంత గ్రామమైన బోరభేటి ప్రజలు కీలక తీర్మానం చేశారు. అంత్యక్రియలకు హాజరుకాకూడదని



నిర్ణయించుకున్నారు. గ్రామంలో మృతదేహానికి ఖననం చేయడానికి అనుమతించమని పేర్కొన్నారు. "ఈ నేరస్థుడి అంత్యక్రియలకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్నాం.. అతని కుటుంబాన్ని కూడా గ్రామం నుంచి వెలివేశాం. నేరస్థులతో కలిసి జీవించలేం" అని స్థానిక నివాసి సక్లైన్ ఓ జాతీయ మీడియా సంస్థతో పేర్కొన్నారు. మరో స్థానికుడు అసదుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ.. "మా గ్రామస్థుడు ఇలాంటి చర్యకు పాల్పడటం సిగ్గు చేటుగా భావిస్తున్నాం. నేరస్థుడు చనిపోయాడని తెలియగానే, అతని మృతదేహాన్ని మా స్మశానవాటికలో ఉంచకూడదని నిర్ణయించుకున్నాం. అతడి అంత్యక్రియలకు కూడా గ్రామస్థులెవరూ హాజరు కారు" అని తెలిపారు.``

ముందడుగు
ఆదివారం, 25-08-2024, హైదరాబాద్

# తమిళనాడు మహిళా పోలీసులకు శుభవార్త

## 12 నెలల పాటు మెటర్నటీ సెలవులు మంజూరు



ముందడుగు తమిళనాడు:
తమిళనాడు మహిళా పోలీసులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఇచ్చిన ప్రసూతి సెలవులను భారీగా పెంచేసింది. ఇక నుంచి 12నెలల పాటు మెటర్నటీ లీవ్స్‌ను మంజూరు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. సెలవులతో పాటు మహిళా పోలీసులకు మరిన్ని సౌకర్యాలు కూడా కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. డెలీవరీ అనంతరం మహిళా ఉద్యోగులు ఎంపిక చేసుకున్న ప్రాంతంలోనే మూడేళ్లపాటు ఉద్యోగం చేసుకునేలా కూడా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది.

చెన్నైలోని రాజరథినం స్టేడియంలో శుక్రవారం ఓ ఈవెంట్ జరిగింది. ఇందులో భాగంగానే విధుల్లో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్రపతి పతకం, కేంద్ర హోంమంత్రి పతకాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తమిళనాడు సీఎం ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. మహిళా పోలీసులకు ఏడాది పాటు ప్రసూతి సెలవులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

## జంక్ ఫుడ్ తినొద్దని చెప్పిన భర్త..

# భర్తపై గృహ హింస కేసు పెట్టిన భార్య



ముందడుగు కర్ణాటక:
ఓ జంటకు ఇటీవలే బిడ్డ జన్మించింది. దాంతో కాన్పు తర్వాత భార్య ఆరోగ్యం విషయంలో భర్త పలు జాగ్రత్తలు తీసుకున్నాడు. అందులో భాగంగా పౌష్టికాహారం మాత్రమే తీసుకోవాలని భార్యకు సూచించాడు. ఆరోగ్యానికి మేలు చేసేది ఏది అడిగినా తెచ్చి ఇచ్చాడు. ఈ క్రమంలో భార్య తనకు ఫ్రెంచ్ ఫ్రైస్ తినాలని ఉందని చెప్పింది. బాలింతరాలు కావడంతో జంక్ ఫుడ్ వద్దని భర్త అభ్యంతరం చెప్పాడు. దాంతో ఆగ్రహానికి లోనైన భార్య నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భర్తపై గృహ హింస కేసు పెట్టింది. ఈ సంఘటన కర్ణాటకలో జరిగింది.

తన భర్త తనను ఫ్రెంచ్ ఫ్రైస్ తిననివ్వడంలేదని, ఇది గృహహింస కిందికే వస్తుందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సదరు భర్తను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. విషయం తెలుసుకుని ఇద్దరికీ రాజీ చేసేందుకు పోలీసులు ప్రయత్నించినా భార్య వినిపించుకోలేదు. దాంతో ఆమె భర్త హైకోర్టును ఆశ్రయించాడు. తనపై నమోదైన గృహ హింస కేసును కొట్టేయాలంటూ విజ్ఞప్తి చేశాడు. ఈ వింత కేసును విచారించిన జడ్జి.. జరిగిన సంగతి తెలుసుకుని భార్యను మందలించారు. భార్య ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఫ్రెంచ్ ఫ్రైస్ తినవద్దని చెబితే ఎదురు కేసు పెట్టడం సబబు కాదని చీవాట్లు పెట్టాడు. ఆమె భర్తపై పోలీసులు నమోదు చేసిన కేసుపై స్టే విధించారు. ఆమె భర్త ఉద్యోగ నిమిత్తం అమెరికా వెళ్లేందుకు అనుమతించారు.

## ఫేస్‌బుక్ అకౌంట్‌ను డిలీట్/ డీయాక్టివేట్

# చేయడం ఎలాగో తెలుసా?

ముందడుగు టెక్నాలజీ:
స్మార్ట్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ ఫేస్ బుక్ ఇప్పుడు చాలా సర్వసాధారణమైపోయింది. సినిమా, బిజినెస్, ఎడ్యుకేషన్, ఎంటర్టైన్మెంట్, స్పోర్ట్స్ , పాలిటిక్స్.. ఇలా ఏ విధమైన ప్రచారమైనా ఫేస్బుక్ ద్వారా వేగంగా చేసుకోవచ్చు. మారుమూల గ్రామాల్లో సైతం ఫేస్బుక్ ఈజీగా యాక్సెస్ చేస్తున్నారు. అయితే సోషల్ మీడియా అకౌంట్ల వల్ల ఎన్ని ఉపయోగాలున్నాయో అదే స్థాయిలో నష్టాలు కనిపిస్తున్నాయి. అవసరానికి మించి వాడటం, తప్పడు మార్గాల్లో వినియోగం వల్ల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అలాంటి సందర్భాల్లో ఫేస్బుక్ అకౌంట్ను ఎలా డిలీట్ చేయడం లేదా డీ యాక్టివేట్ చేయడం ఇక్కడ తెలుసుకుందాం..


- మొదటగా మొబైల్ లేక డెస్క్ టాప్ లో ఫేస్బుక్ లాగిన్ అవ్వాలి.
- టాప్ రైట్ కార్నర్లో వరుసగా ఉన్న గీతలపై క్లిక్ చేయాలి.
- సెట్టింగ్స్ సింబల్ పై క్లిక్ చేయాలి.
- మెటా అకౌంట్ సెంటర్ అని





కనపడుతుంది. దానిలో మొదటి ఆప్షన్ పర్సనల్ డిటెయిల్స్ ఆప్షన్ ఎంచుకోవాలి.
- లాగింగ్ విత్ అకౌంట్స్ ఆప్షన్ కింద ఉన్న పర్సనల్ డిటెయిల్స్ ఆప్షన్ ఎంచుకోవాలి.
- పర్సనల్ డిటెయిల్స్లో కాంటాక్ట్ ఇన్ఫో, బర్త్ డే, ఐడెంటిటీ కన్ఫర్మేషన్, అకౌంట్ ఓనర్ షిప్ అండ్ కంట్రోల్ ఆప్షన్స్ ఉంటాయి.
- చివర్లో ఉన్న అకౌంట్ ఓనర్ షిప్ అండ్ కంట్రోల్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి.
- అందులో డీయాక్టివేషన్ OR డిలీట్ అనే ఆప్షన్ కనపడుతుంది.
- దానిపై క్లిక్ చేసినప్పుడు మన మొబైల్ నంబర్ లింక్ చేయబడిన ఫేస్బుక్ అకౌంట్ చూపిస్తుంది.
- ఒకవేళ ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ కూడా ఫేస్ బుక్ కాన్ఫిగర్ చేసి ఉంటే ఇన్ స్టా అకౌంట్ కూడా మనకి కనిపిస్తుంది.
- ఏదైతే అకౌంట్ మనం డిలీట్ చేయాలనుకుంటున్నామో దాన్ని సెలక్ట్ చేయాల్సి ఉంటుంది.
- ఇక్కడ మనకు డీయాక్టివేట్, డిలీట్ అనే రెండు ఆప్షన్స్ కనిపిస్తాయి.
- డీయాక్టివేట్ ఆప్షన్ ఎంచుకుంటే అకౌంట్ మత్రమే ఉంటుంది. దానిలో ఉన్న ఫొటోలు, ఇతర షేర్ చేసిన ఇన్ఫర్మేషన్ మొత్తం డిలీట్ అవుతుంది. మళ్లీ మనకి అవసరం అయినప్పుడు తిరిగి యాక్టివేట్ చేసుకునే వీలుంటుంది. అకౌంట్ను డీయాక్టివేట్ చేసినప్పటికీ మీరు మెసెంజర్ను మాత్రం వాడుకునే సౌలభ్యం ఉంటుంది.
- డిలీట్ అకౌంట్ ఆప్షన్ ఎంచుకుంటే మన పేరుతో ఉన్న ఫేస్బుక్ అకౌంట్ పూర్తిగా తొలగించబడుతుంది. మళ్లీ మనం యాక్టివేట్ చేసుకునే వీలు కూడా ఉండదు. అవసరమైతే కొత్త అకౌంట్ క్రియేట్ చేయడం మినహా వేరే ఆప్షన్ ఉండదు.

## సత్యసాయి విద్యావిహార్‌లో

# మాతృపూజ వేడుకలు



ముందడుగు హైదరాబాద్:
తల్లిదండ్రులను గౌరవించినప్పుడే ప్రతి విద్యార్థి తన జీవితంలో ఉన్నత స్థానంలో ఎదుగుతారని సత్యసాయి విద్యావిహార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ అన్నారు. శనివారం డీడీ కాలనీలో సత్యసాయి విద్యావిహార్ లో మాతృపూజ కార్యక్రమం నిర్వహించారు. ఒకటవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులతో వారి మాతృమూర్తులకు పూజ చేపించి, పాదాలకు నమస్కరింపచేశారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు తల్లిదండ్రుల ఆశీర్వచనం తీసుకొవాలని సూచించారు. తల్లితండ్రి గొప్పదనం గురించి వివరించారు. ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ చిన్నతనం నుంచే మన పిల్లలకు మన సంస్కృతి,



సంప్రదాయాలను ఆసక్తి పెంచాలన్నారు. పెద్దలు, గురువులను గౌరవిస్తూ, తోటివారితో ప్రేమగా ఉండేలా వారిని తీర్చిదిద్దే బాధ్యతను తాము తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, సంతోషి రాణి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముందడుగు
ఆదివారం, 25-08-2024, హైదరాబాద్

## శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్లో
# శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



ముందడుగు వరంగల్:

వరంగల్ జిల్లా లేబర్ కాలనీలోని శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి తెలిపారు. బాలికలు అందరూ గోపికలు, యశోద, మరియు బాలురు అందరు శ్రీకృష్ణుడు, కుచేలుడు, కంసుని వేషధారణలో విచ్చేసి అలరించారు. మొదటగా రాధాకృష్ణుల ప్రతిమను పూజించి, అనంతరం అటుకులు బెల్లం ప్రసాదాన్ని పంచిపెట్టి, ఉట్టి కొట్టుడు కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరిగిందని శశిధర్ రెడ్డి తెలిపారు. అనంతరం శ్రీకృష్ణుని జీవిత గాధను విద్యార్థులకు వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బాలాజీ పాఠశాలలో
# మాక్ పోలింగ్



ముందడుగు ములుగు :

ములుగు జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్లో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వరరావు హాజరై మాక్ పోలింగ్ ను పరిశీలించి మాట్లాడారు. ఉన్నతమైన సమాజానికి ఓటు ప్రధాన ఆయుధమని సూచించారు. ఇలాంటి చక్కటి కార్యక్రమాలు నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ కొలగాని రజనీకాంత్ మాట్లాడుతూ సమాజంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని,ఓటు వినియోగంతో ప్రజా సమస్యల పరిరక్షనే ధ్యేయంగా పాలకవర్గాన్నిఎన్నుకునే అవకాశం,ఓటర్ చేతుల్లో ఉంటుందని విద్యార్థులకు మాక్ పోలింగ్ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఏ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి హాజరై విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్ణేందర్, రతన్ సింగ్, రఘు, సునీత, అనూష తదితరులు పాల్గొన్నారు.



# ఆడపిల్లకు మొదటి హీరో నాన్నే..!

- తండ్రి అంటేనే అమ్మాయిలకు ప్రేమ ఎక్కువ
- తండ్రిని ఒక ఫ్రెండ్‌లా ట్రీట్ చేస్తారు
- తల్లిని దైవమే కాని తండ్రితోనే హ్యాపీ..

ముందడుగు ప్రత్యేకం:

ఆడపిల్లలకు తల్లి దగ్గర కంటే, తండ్రి దగ్గరే చనువు బాగా ఉంటుంది. ఎవరి ఇంట్లోనైనా ఆడపిల్లలు తండ్రిని ఎక్కువగా ఇష్టపడితే.. మగపిల్లలు తల్లిని ఇష్టపడతారు. తల్లి కంటే ఎక్కువగా తండ్రిని ఇష్టపడి ఒక స్నేహితుడిలా ట్రీట్ చేస్తారు. తండ్రితో కలిసి బయటికి వెళ్తారు. వారి సీక్రెట్స్ ఎక్కువగా తండ్రితోనే చెప్పకుంటారు. తల్లినీ దైవంగా భావించినప్పటికీ ఆమె కంటే ఎక్కువగా తండ్రితోనే సంతోషంగా గడుపుతారు.

### అమ్మాయి చూసే మొదటి మగవ్యక్తి నాన్న

ప్రతి ఇంట్లో ఆడపిల్ల తన జీవితంలో చూసే మొదటి మగవ్యక్తి నాన్న. వారు జీవించే విధానం ఆడపిల్లలను ఎక్కువగా ఎఫెక్ట్ చేస్తుంది. ఓ రకంగా చెప్పాలంటే వారికి మొదటి హీరో నాన్నే. నాన్న ఆడపిల్లకి బలబలాల గురించి చెబుతారు. ఎప్పడు బలంగా ఉండాలో ఏ సమస్యని ఎలా ఎదుర్కోవాలో చెప్పడమే కాకుండా.. ఏ సమయంలో ఎలా ఉండాలో కూడా వారే చెబుతారు.

### పక్కన తండ్రి ఉంటే ఒక ధైర్యం

తల్లీ ప్రేమగా చూసినప్పటికీ.. తండ్రి వారిని రక్షిస్తారు, తండ్రి పక్కన ఉంటే ఓ సెక్యూరిటీ ఉన్నట్లుగా భావిస్తారు. ఎవరు ఏం చేయలేరన్న భావన ఆడపిల్లలకి ఉంటుంది. అందరికంటే ఎక్కువగా వారిని చూసేది తండ్రి. వారిని ప్రతి విషయంలోనూ రక్షిస్తారు. అలాగే వారికి కూతుళ్లని కిందకి లాగడానికి ఎవరైనా ప్రయత్నిస్తే దానిని ఎదురిస్తాడు. దీంతో ఆడపిల్లలకి తండ్రి అంటే ప్రేమ ఎక్కువగా ఉంటుంది.

### అమ్మాయికి స్వేచ్ఛను ఇచ్చేది నాన్నే

తాను ఎంత తక్కువ స్థాయిలో ఉన్నా తన కూతురిని మాత్రం రాణిలా చూసుకుంటారు. ఎప్పడు తక్కువ చేయడు. వారంతటా వారు ఇండిపెండెంట్‌గా ఎలా ఎదగాలో చూపిస్తాడు. వారికి అంత స్వేచ్ఛనిస్తాడు నాన్న. ఆడపిల్లలు ఎప్పడు కూడా వారిని జాగ్రత్తగా చుసుకుంటూ వారి వెనుకే నిలబడతాడు. వారి ఎక్స్‌పెక్టేషన్స్‌ని ఎప్పడు కూడా తగ్గించడు. చదువు, ఉద్యోగం విషయంలో ఎలాంటి సవాళ్లని ఎదుర్కోవాలో ఏ రిస్క్‌ని ఎలా ఎదురించాలో చెబుతారు. మీరు ఎంత ఎత్తుకి ఎదిగినా, కిందికి పడిపోయినా ఎప్పడు నిరుత్సాహపడరు. కూతురిని ఎప్పటికి బలంగా తయారుచేస్తారు నాన్న.

ముందడుగు
ఆదివారం, 25-08-2024, హైదరాబాద్

# ఎన్ కన్వెన్షన్‌లో నాగార్జున స్థలం ఎంత.. కబ్జా ఎంత..






ముందడుగు హైదరాబాద్:
హైదరాబాద్ నగరంలో ఇప్పుడు హైడ్రా పనితీరు సంచలనంగా మారింది. శనివారం హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్.. హైటెక్ సిటీ జంక్షన్ లో వేల కోట్ల విలువైన 10 ఎకరాల విస్తర్ణంలో ఉంటుంది.. ఇందులో వందలు, వేల కోట్ల డబ్బు ఉన్నవాళ్లు ఫంక్షన్స్ అన్నీ ఇక్కడే జరుగుతుంటాయి.. భారీ ఎత్తున సెట్టింగ్స్ వేస్తూ విలాసవంతమైన వేడుకలను ఇందులో నిర్వహిస్తుంటారు. ఎన్ కన్వెన్షన్.. మొత్తం 10 ఎకరాల్లో విస్తరించి ఉంది.. ఇప్పుడు హైడ్రా.. హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ.. తన విశ్వరూపం చూపించింది. 2015 నుంచి ఎన్ కన్వెన్షన్ సెంటర్ ఆక్రమణలో ఉన్న తుమ్మడిగుంట చెరువును రక్షించింది.

## ఎన్ కన్వెన్షన్ పూర్తి వివరాలు..

హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ మొత్తం 10 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ 10 ఎకరాల్లో తుమ్మటికుంట చెరువు ఆక్రమణ భూమి 3.5 ఎకరాలు. ఇందులో ఒక ఎకరా 12 సెంట్లు FTL ( ఫుల్ ట్యాంక్ లెవల్). మరో రెండు ఎకరాలు బఫర్ జోన్. చెరువు భూమి. తుమ్మిడికుంట చెరువు మొత్తం విస్తీర్ణం 29 ఎకరాలు. ఇందులో హీరో నాగార్జున ఆక్రమించింది 3.5 ఎకరాలు. ఇప్పుడు ఆ చెరువు ఆక్రమణలో ఉన్న నిర్మాణాలనే హైడ్రా కూలగొట్టింది. 2015లో నాగార్జున ఎన్ కన్వెన్షన్ నిర్మాణం జరిగింది.

అప్పటి నుంచి ఈ వివాదం నడుస్తుంది. ఎన్ కన్వెన్షన్.. తుమ్మడికుంట చెరువు FTLకు 25 మీటర్లలోనే కట్టారు.. నిబంధనల ప్రకారం 30 మీటర్ల ఎత్తులో ఉండాలి.. తుమ్మడికుంట చెరువు ఆక్రమణలో రెండు పెద్ద హాల్స్, ఇతర శాశ్వత నిర్మాణాలు చేపట్టింది ఎన్ కన్వెన్షన్.. ఇప్పుడు వాటిని పూర్తిగా నేల మట్టం చేశారు హైడ్రా అధికారులు. ఎన్ కన్వెన్షన్ పరిధి కేవలం 6.5 ఎకరాలు మాత్రమే..

# తండ్రైన హాలీవుడ్ పాప్ సింగర్ జస్టిన్ బీబర్



హాలీవుడ్ స్టార్ పాప్ సింగర్ జస్టిన్ జస్టిన్ బీబర్ తండ్రయ్యాడు. జస్టిన్ బీబర్ భార్య, మోడల్ హేలీ బీబర్ శనివారం ఉదయం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని జస్టిన్ సోషల్ మీడియా వేదికగా తెలుపుతూ.. "వెల్కమ్ హోమ్ జాక్ బ్లూస్ బీబర్" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టాడు. ఇక తన కొడుకుకు జాక్ బ్లూస్ బీబర్ అని నామకరణం చేసినట్లు ప్రకటించారు. స్టార్ సింగర్ సెలెనా గోమెజ్‌తో విడిపోయిన అనంతరం హేలీ బీబర్‌ను పెళ్లి చేసుకున్నాడు జస్టిన్. 2018లో పెళ్లి చేసుకోగా.. ఆరు సంవత్సరాల తర్వాత పేరెంట్స్ అయ్యారు ఈ జంట. 2010లో వచ్చిన మై వరల్డ్ ఆల్బమ్‌లోని బేబీ సాంగ్‌తో ఫుల్ పాపులర్ అయ్యాడు జస్టిన్. ఈ పాట అప్పట్లో ప్రపంచంలో సగం మందికి పైగా విన్నట్లు రికార్డు కూడా సృష్టించింది. ఇటీవల అంబానీ పెళ్ళిలో జస్టిన్ తన పాటలతో ఆకట్టుకున్నాడు. ఈ ఈవెంట్ కోసం జస్టిన్ ఏకంగా రూ.100 కోట్లు ఆఫర్ చేసినట్లు సమాచారం.



# గొడవైతే ఏడ్చేస్తా

మహేష్‌బాబు హీరోగా నటించిన '1 నేనొక్కడినే' సినిమాతో ఇండస్ట్రీలోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది కృతిసనన్. అల్లు అర్జున్ నటించిన 'పరుగు' సినిమా రీమేక్‌తో హిందీలోకి అరంగేట్రం చేసింది. ఆ తర్వాత వరుస విజయాలతో లక్కీ గాళ్ అనిపించుకుంది. తాజాగా 'క్రూ' సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఇటీవల మీడియాతో ఆమె పంచుకున్న కబుర్లు వైరల్ అవుతున్నాయి. 'రిలేషన్‌షిప్ అన్న తర్వాత చిన్నచిన్న గొడవలు సాధారణమే. అయితే, గొడవ జరిగినప్పుడు నా తప్పు ఉంటే తప్పకుండా నేనే సారీ చెబుతాను. నా తప్పు లేకుంటే సారీ చెప్పను. ఏది ఏమైనా ఆ సమస్యను పరిష్కరించుకొని రిలేషన్‌ను కంటిన్యూ చేయడానికి ప్రయత్నిస్తా! ఏదైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు కన్నీళ్లు రావు అని అబద్ధం చెప్పను. అలాగని ప్రతి దానికీ ఏడుస్తూ కూర్చోను. తట్టుకోలేనంత బాధయితే మాత్రం ఏడ్చేస్తా! నా అనుకున్నవాళ్లతో గొడవైతే మాత్రం వెంటనే కన్నీళ్లు వచ్చేస్తాయి. నాకు సినిమా అంటే ఇష్టం. ఈ రంగంలోనే కొనసాగాలని అనుకుంటున్నా. వర్క్‌లైఫ్ బిజీగా ఉండటమే నిజమైన ఆనందం' అంటున్నది కృతి సనన్.